
16-06-2025
సోమవారం
మల్కాజిగిరి

jayabherinews

JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 02 | సంచిక : 259 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి




- ఒకొక్కరి ఖాతాల్లోకి రూ.30 వేలు..
- మహాలక్ష్మి పథకం విస్తరణ..
- స్థానిక ఎన్నికల వ్యూహం..

జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణ రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలను వేగంగా అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, సర్పంచ్ ఎన్నికలకు ముందే మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం అందించే కీలక పథకాన్ని ప్రారంభించేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇది ప్రభుత్వ ప్రధాన హామీలలో ఒకటైన మహాలక్ష్మి పథకంలో భాగంగా రాబోయే ఉప పథకం. ఈ నిర్ణయం రాష్ట్రంలోని లక్షలాది మంది మహిళలకు గణనీయమైన ఆర్థిక భరోసాను కల్పించడంతో పాటు.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీకి అదనపు బలాన్ని చేకూర్చనుంది.

**మహాలక్ష్మి పథకం విస్తరణ..**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తమ ఆరు గ్యారెంటీలను అమలు చేయడం ప్రారంభించింది. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి పథకం (200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్) వంటి పథకాలు అమల్లో ఉన్నాయి. ఇందిరమ్మ ఇళ్ల పథకం కూడా ప్రారంభమై.. పలువురు లబ్ధిదారులకు మొదటి విడత నిధులు కూడా అందాయి. ఇప్పుడు మహిళలకు ఆర్థిక సాయం కింద నెలకు రూ.2,500 అందించే

...మిగతాది 2 లో

తెలంగాణలో సర్పంచ్ ఎన్నికలకు ముందే మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం అందించే పథకం ప్రారంభం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇది కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల పథకాల్లో ఒకటిగా ఉంది. మహాలక్ష్మి పథకంలో భాగంగా.. రూ.30,000 ఏటా అందుతాయి. 55 ఏళ్ల లోపు, పింఛను పొందని తెల్ల రేషన్ కార్డు మహిళలు అర్హులుగా ఉండే ఛాన్స్ ఉన్నట్లు సమాచారం. జూలైలో సర్పంచ్ ఎన్నికలు జరగనున్నాయి. రైతు భరోసా నిధులు కూడా కొద్ది రోజుల్లో జమ అవుతాయి. ఈ నిర్ణయాలు ఎన్నికల ముందు విశ్వాసాన్ని పెంపొందించి.. హామీల అమలుకు ప్రాధాన్యతను సూచిస్తున్నాయి.

# రాజకీయ వ్యూహం

## బీజేపీలోకి మెగాస్టార్ చిరంజీవి వస్తారు
## కిషన్‌రెడ్డి వ్యాఖ్యల వెనుక ఉద్దేశ్యం..
## కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు ఉత్కంఠను రేపాయి



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి బీజేపీలోకి చిరంజీవిని ఆహ్వానిస్తే వస్తారని ప్రకటించారు. కుటుంబ, అవినీతి రాజకీయాలకు వ్యతిరేకంగా తమ పార్టీ పోరాడుతుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగా పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్‌లో తదుపరి అధ్యక్షుడు ఎవరో అందరికీ తెలుసని.. ఎద్దేవా చేస్తూ, బీజేపీలో ఆంతరంగిక నియమాలు ఉంటాయన్నారు.

జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణలో టెక్స్‌టైల్ ప్రాజెక్ట్, పసుపు బోర్డు, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ వంటి అభివృద్ధి బీజేపీ వల్లే వచ్చాయని కిషన్‌రెడ్డి చెప్పుకున్నారు. హైదరాబాద్ మెట్రో నెక్స్ట్ ఫేజ్‌కు కేంద్రం సహకరిస్తుందని తెలిపారు. చిరంజీవి రాజకీయాల నుంచి విరమించుకున్నా.. కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు ఉత్కంఠను రేపాయి.

తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ప్రముఖ సినీ నటుడు, మెగాస్టార్ చిరంజీవి ప్రస్తావన మరోసారి చర్చకు దారితీసింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి మీడియా ప్రతినిధులతో జరిగిన చిట్‌చాట్‌లో కీలక వ్యాఖ్యలు చేశారు. "బీజేపీలోకి ఎవరైనా రావాలంటే పిలిచేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, తన మాట కాదనకుండా పిలవగానే చిరంజీవి వస్తారని" ఆయన తన మనసులోని అభిప్రాయాన్ని బయటపెట్టారు. ఈ వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో, ముఖ్యంగా సినీ, రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

...మిగతాది 2 లో

## విద్యా రంగంలో విశేష సేవలు



2 లో




# మేం రంగంలోకి దిగితే వార్ వన్ సైడే..!

- ఇరాన్ కు ట్రంప్ మాస్ వార్నింగ్...
- భీకరంగా మారిన ఇజ్రాయేల్, ఇరాన్ దాడులు..
- సీరియస్ అయిన అమెరికా..

ఇజ్రాయేల్, ఇరాన్ ల మధ్య వార్ తారాస్థాయికి చేరింది.ఈ క్రమంలో అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు మాస్ వార్నింగ్ ఇచ్చారు. ఈ క్రమంలో తాము రంగంలోకి దిగితే యుద్ధం పరిణామం పూర్తిగా మారిపోతుందని హెచ్చరించారు. ఇరాన్, ఇజ్రాయేల్ దేశాల మధ్య యుద్ధం పీక్స్ కు చేరింది. ఆపరేషన్ రైజింగ్ లయన్ పేరుతో ఇజ్రాయేల్ భీకర దాడుల్ని చేస్తుంది. ఈ క్రమంలో రెండు దేశాలు కూడా క్షిపణులు, ఫైటర్ జెట్‌లు, డ్రోన్ లతో దాడులు చేసుకుంటున్నాయి. ఇజ్రాయేల్ బెదిరింపులకు.. ఏమాత్రం తలొగ్గని ఇరాన్ కూడా.. గట్టిగానే పోరాటం చేస్తుంది. ఈ క్రమంలో ఇప్పటికే ఇరాన్ పలు

...మిగతాది 2 లో

## ప్రేమగా మారిన తొలి పరిచయం



2 లో

# సైప్రస్ చేరుకున్న ప్రధాని మోదీ..!

## ఎయిర్ పోర్ట్‌లో స్వాగతం పలికిన అధ్యక్షుడు



సైప్రస్ అధికారిక పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం లార్నాకా అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ ప్రధాని మోదీకి ఎయిర్ పోర్ట్‌లో సాదర స్వాగతం పలికారు. అధ్యక్షుడు క్రిస్టోడౌలిడెస్ ఆహ్వానం మేరకు జూన్ 15-16 వరకు ప్రధాని మోదీ రెండు రోజుల పాటు సైప్రస్‌లో పర్యటించనున్నారు. ఈ పర్యటన ప్రధాని మూడు దేశాల పర్యటనలో భాగం. ఇందులో క్రొయేషియాలో ఒక స్టాప్, జూన్ 16-17న కెనడాలో జరిగే G7 సమ్మిట్‌లో పాల్గొనడం కూడా ఉంటుంది. సైప్రస్‌లో ఉన్న సమయంలో ప్రధాని మోదీ సైప్రియట్ నాయకత్వంతో

...మిగతాది 2 లో

# హాస్టల్ విద్యార్థులకు ఏపీ ప్రభుత్వం శుభవార్త



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హాస్టళ్లలో ఉండే విద్యార్థుల కోసం కీలక నిర్ణయం తీసుకుంది. సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు 50 వేల రూపాయల వరకు ఆరోగ్య బీమా కల్పించనుంది. ఇప్పటికే కోనసీమ జిల్లాలో అమలవుతున్న 'గోల్డెన్ అవర్ బీమా' పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. దీని ద్వారా విద్యార్థులకు ప్రైవేట్ ఆసుపత్రుల్లోనూ ఉచితంగా వైద్యం పొందే అవకాశం లభిస్తుంది.

- ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం
- సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు ఆరోగ్య బీమా
- రాష్ట్రం మొత్తం గోల్డెన్ అవర్ బీమా పథకం అమలు
- హాస్టల్ విద్యార్థులకు ఉచితంగా రూ.50 వేల వరకు

జయభేరి, విజయవాడ :

ఇంటికి దూరంగా హాస్టళ్లలో ఉండే విద్యార్థుల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వారికి 50 వేల రూపాయల వరకు ఆరోగ్య బీమా సదుపాయం కల్పించేందుకు ప్రణాళికలు రచిస్తోంది.

...మిగతాది 2 లో

మొదటిపేజీ తరువాయి

## తెలంగాణ మహిళలకు శుభవార్త

పథకం అమలుపై ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ పథకం ద్వారా అర్హులైన మహిళలకు సంవత్సరానికి రూ.30,000 వారి బ్యాంకు ఖాతాల్లో జమ కానున్నాయి. ఈ పథకానికి సంబంధించిన విధివిధానాలను అధికారులు ముమ్మరంగా రూపొందిస్తున్నారు. 55 ఏళ్ల లోపు మహిళలను ప్రధాన లబ్ధిదారులుగా ఎంపిక చేయనున్నట్లు తెలుస్తోంది. తెల్ల రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకుని, ప్రభుత్వ పింఛను (వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల పింఛను వంటివి) పొందని కుటుంబాల్లోని మహిళలకే ఈ సహాయం అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇది ప్రభుత్వ హామీల అమలులో పారదర్శకతను, సామాజిక న్యాయాన్ని పాటిస్తుందని స్పష్టం చేస్తుంది. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గతంలో పలు సందర్భాల్లో ముఖ్యమంత్రి త్వరలోనే మహిళలకు ఈ తీపి కబురు తెలియజేస్తారని పేర్కొన్నారు.. ఇది మహిళల్లో ఈ పథకంపై ఆశలను పెంచింది.

**స్థానిక ఎన్నికల వ్యూహం..**

మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం పథకం అమలు స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు జరగడం వెనుక బలమైన రాజకీయ వ్యూహం ఉంది. జూలై నెలాఖరున సర్పంచ్ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల కాబోతుందని.. ఈ అంశంపై క్యాబినెట్ లో చర్చించి ఎన్నికల తేదీపై స్పష్టత ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. తొలుత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు, ఆ తర్వాత సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈలోపే మహిళలకు ఆర్థిక భరోసా కింద డబ్బులను జమ చేయడం ద్వారా, ప్రభుత్వం ఎన్నికల హామీలను నిలబెట్టుకుంటుందని ప్రజలకు స్పష్టమైన సందేశం ఇవ్వాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రైతులకు రైతు భరోసా నిధులు జమ చేసే పనిలో ప్రభుత్వం నిమగ్నమై ఉంది. రెండు మూడు రోజుల్లో దీనికి సంబంధించి స్పష్టత వచ్చే అవకాశం ఉందని, వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతు భరోసా నిధులు ఈ నెలాఖరులోగా జమ చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలియజేశారు. ఈ రెండు ముఖ్యమైన పథకాలను స్థానిక ఎన్నికలకు ముందే అమలు చేయడం ద్వారా.. కాంగ్రెస్ పార్టీ క్షేత్ర స్థాయిలో తన పట్టును మరింత బలోపేతం చేసుకోవాలని, ప్రజల్లో తమపై విశ్వాసాన్ని పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఎన్నికల హామీలను నెరవేర్చడం ద్వారా ప్రజల మద్దతును కూడగట్టుకుని, గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు తమ ప్రభావాన్ని విస్తరించాలని కాంగ్రెస్ నాయకత్వం ప్రయత్నిస్తోంది.

## హాస్టల్ విద్యార్థులకు ఏపీ ప్రభుత్వం శుభవార్త

సంక్షేమ వసతి గృహాల్లో ఉండే విద్యార్థుల కోసం ఈ పథకాన్ని తీసుకురాబోతుంది. విద్యార్థులకు చిన్నచిన్న అనారోగ్య సమస్యలు, దెబ్బలు తగిలినప్పుడు.. ఆలస్యం చేస్తే అవి దీర్ఘకాలిక సమస్యలుగా మారుతున్నాయి. వారిని ఆస్పత్రులకు తీసుకెళ్తే.. ఆ ఖర్చు సంక్షేమ అధికారులపై పడుతుండటంతో.. వారు వెనకాడాల్సిన పరిస్థితి ఉంది. ఈ క్రమంలో విద్యార్థులకి 50 వేల రూపాయల వరకు బీమా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే ఈడాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల ఈ తరహా పథకాన్ని అమలు చేస్తున్నారు.
సంక్షేమ వసతి గృహాల్లో ఉండే విద్యార్థులకు ఆరోగ్య భరోసా కల్పించేందుకుగాను గతేడాది అనగా 2024లో కోనసీమ జిల్లా కలెక్టర్ 'గోల్డెన్ అవర్ బీమా' పథకాన్ని తీసుకు వచ్చారు. ఈ క్రమంలో ఏపీలోని కూటమి ప్రభుత్వం.. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని హాస్టళ్లలో దీన్ని అమలు చేయాలని భావిస్తోంది. ఇందుకోసం అంబేద్కర్ జిల్లాలో ఈ పథకం అమలు తీరును పరిశీలిస్తోంది. అంబేద్కర్ జిల్లాలో వసతి గృహాల్లో ఉండే సుమారు 8వేల మందికి గోల్డెన్ అవర్ బీమా పథకం అమలు చేస్తున్నారు. వేదాంత సంస్థ వీరందరికి ఒక్కొక్కరికి రూ.200 చొప్పున ప్రీమియం చెల్లిస్తుంది. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ఈ బీమా ప్రీమియం మొత్తాన్ని వేదాంత కంపెనీ భరిస్తుంది. ఇక గోల్డెన్ అవర్ బీమా పథకం ద్వారా.. విద్యార్థులు ఏడాదికి రూ.50 వేల వరకు విలువైన చికిత్సను ఉచితంగా చేయించుకునే అవకాశం ఉంది. అయితే అంబేద్కర్ జిల్లాలో ఈ పథకం ప్రవేశపెట్టడానికి ముందు వరకు కూడా సంక్షేమ వసతి గృహాల్లో ఉండే విద్యార్థులకు అనారోగ్య సమస్యలు తలెత్తితే వారిని ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ఆసుపత్రులకు తీసుకెళ్లేవారు. అయితే ఇవి హాస్టల్స్‌కు దూరంగా ఉండటంతో సమయానికి తగిన చికిత్స అందక కొన్ని సందర్భాల్లో ఇబ్బంది అవుతుంది. అదే ప్రైవేటు ఆస్పత్రికి తీసుకుళ్తే మనమే డబ్బులు ఖర్చుపెట్టుకోవాలి. విద్యార్థుల దగ్గర అంత మొత్తం ఉండదు. ఈ సమస్య పరిష్కారం కోసం గోల్డెన్ అవర్ బీమా పథకాన్ని తీసుకువచ్చారు. దీని ద్వారా ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం పొందేందుకు అవకాశం కలగడమే కాక.. ఒకటి, రెండు రోజులు ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్లుగా చికిత్స పొందేందుకు కూడా అవకాశం ఉంది. ప్రస్తుతం అంబేద్కర్ జిల్లాలో దీని అమలు తీరును పరిశీలిస్తున్నారు. త్వరలోనే రాష్ట్రంలోని అని సంక్షేమ వసతి గృహాల్లో కూడా దీన్ని అమలు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోబోతుంది. ఇది విద్యార్థులకు శుభవార్త వంటిదే అని చెప్పవచ్చు.

## మేం రంగంలోకి దిగితే వార్ వన్ సైడే..!

అగ్రదేశాలకు వార్నింగ్ ఇచ్చిన విషయం తెలిసిందే. ముఖ్యంగా అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ లు.. ఇజ్రాయేల్ కు మద్దతుగా రంగంలోకి దిగితే.. తీవ్ర పరిణామాలుంటాయని, ఆ దేశం సైనికస్థావరాలు, మిలటరీ బలగాలను టార్గెట్ చేయాల్సి వస్తుందని ఇరాన్ ఇప్పటికే హెచ్చరించింది. ఈక్రమంలో రెండు దేశాల మధ్య భీకరమైన దాడులతో మిడిల్ ఈస్ట్ లో పెనువిధ్వంసం నడుస్తోంది. మరోవైపు ఇరాన్ అణ్వాయుధ కేంద్రాలపై ఇజ్రాయెల్ భారీ ఎత్తున దాడులు చేస్తుంది. ఇరాన్ సైతం.. ఇజ్రాయేల్ రాజధానిపై దాడులకు తెగబడింది. దీంతో పశ్చిమాసియాలో కల్లోలం వల్ల మూడో ప్రపంచ యుద్ధం వస్తుంద అంటూ ప్రపంచ వ్యాప్తంగా ఆందోళనలు మిన్నంటాయి.ఈ నేపథ్యంలో అమెరికా ప్రెసిడెంట్ డోనాల్డ్ ట్రంప్ ఇరాన్ కు మాస్ వార్నింగ్ ఇచ్చారు. ఇరాన్ రక్షణ మంత్రిత్వ శాఖ ప్రధాన కార్యాలయం, అణు ప్రాజెక్టుపై ఇజ్రాయెల్ భీకర దాడులు తర్వాత అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం ప్రాధాన్యత సంతరించుకున్నాయి. డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ.. ఒక వేళ తాము యుద్ధంలో దిగితే వార్ వన్ సైడ్ అవుతుందని ఇరాన్ కు హెచ్చరికలు జారీచేశారు. ఒకవేళ అమెరికాపై ఇరాన్ దాడికి పాల్పడే దుస్సాహసమే చేస్తే.. చరిత్ర పుటల్లో కనివినీ ఎరుగని రీతిలో ఇరాన్ పై విరుచుకుపడతామని డొనాల్డ్ ట్రంప్ తీవ్రస్థాయిలో హెచ్చరించారు. ఇరాన్ తమను ఏ విధంగా దాడులు చేయడానికి సాహసం చేసిన కూడా.. అన్నిరకాలుగా ఎదుర్కొని అమెరికా సాయుధ దళాల సత్తా ఏంటో చూపిస్తామంటూ కూడా ట్రంప్ తన సోషల్ మీడియా ఖాతా అయితే ట్రూత్ లో పోస్ట్ చేశారు. ఈ ఘటన ప్రపంచ దేశాల్ని మరింత కలవరపెట్టేదిగా మారింది. అదే విధంగా.. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య తాను సులభంగా ఒక ఒప్పందం కుదిర్చి, ఈ యుద్ధంకు ముగింపు పలకాలని భావిస్తున్నట్లు కూడా ట్రంప్ పేర్కొన్నారు. మరోవైపు దేశంలో ప్రస్తుతం నెలకొన్న యుద్ధం పరిస్థితుల వల్ల.. ప్రధాని నేతన్యాహు.. తన కుమారుడి పెళ్లిని సైతం వాయిదా వేసుకున్నట్లు ఆ దేశంలోని పలు మీడియా కథనాలు పేర్కొన్నాయి.

## సైప్రస్ చేరుకున్న ప్రధాని మోదీ..!

ఉన్నత స్థాయి సమావేశాలు నిర్వహించనున్నారు. వాణిజ్యం, సాంకేతికత, విద్య, సాంస్కృతిక మార్పిడిలో సహకారాన్ని పెంపొందించడంపై దృష్టిసారిస్తారు. G7లో కీలకమైన ప్రపంచ చర్చలకు ముందు యూరప్, దాని మిత్రదేశాలతో భారతదేశ దౌత్యపరమైన సంబంధంలో ఇది మరొక ముఖ్యమైన పురోగతిని సూచిస్తుంది. "సైప్రస్‌లో అడుగుపెట్టాను. విమానాశ్రయంలో నన్ను ప్రత్యేకంగా స్వాగతించినందుకు సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్‌కు నా కృతజ్ఞతలు. ఈ పర్యటన ఇండియా-సైప్రస్ సంబంధాలకు, ముఖ్యంగా వాణిజ్యం, పెట్టుబడి, మరిన్ని రంగాలలో గణనీయమైన ఊపును జోడిస్తుంది" అని ప్రధాని మోదీ ఎక్స్‌లో పేర్కొన్నారు. దాదాపు 23 సంవత్సరాల తర్వాత సైప్రస్ ద్వీప దేశంలో పర్యటించిన ప్రధానిగా మోదీ నిలిచారు. ఈ పర్యటన ఇండో-సైప్రియట్ సంబంధాలకు ప్రోత్సాహకంగా మాత్రమే కాకుండా, సైప్రస్‌లో మూడో వంతు ఆక్రమించిన టర్కీకి దౌత్య సందేశంగా కూడా భావిస్తున్నారు. గత నెలలో 'ఆపరేషన్ సిందూర్' సందర్భంగా పాకిస్తాన్‌కు మద్దతు ఇచ్చినందుకు టర్కీపై ఇండియా ఆగ్రహంగా ఉంది.

# విద్యా రంగంలో విశేష సేవలు




**ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అత్యాధునిక సాంకేతిక బోధనా సేవలను ఉచితంగా అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో విశేష సేవలు అందిస్తున్న వివిధ సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన 6 ప్రముఖ సంస్థల భాగస్వామ్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఇకనుంచి అధునాతన ఎడ్‌టెక్ సదుపాయాలు అందనున్నాయి.**

**జయభేరి, హైదరాబాద్ :**

ఆ మేరకు వివిధ రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న స్వచ్ఛంద సంస్థలతో రాష్ట్ర విద్యా శాఖ అధికారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో అవగాహన ఒప్పందాలు చేసుకున్నారు. రోహిణి నందన్ నీలేకని నేతృత్వంలోని ఎక్‌స్టెప్ ఫౌండేషన్, డాక్టర్ సునీతా కృష్ణన్ నేతృత్వంలోని ప్రజ్వల ఫౌండేషన్, అలక్ పాండే అధ్వర్యంలోని ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ, షోయబ్ దార్ నిర్వహిస్తున్న పైజమ్ ఫౌండేషన్, సఫీనా హుస్సేన్ అధ్వర్యంలోని ఎడ్యుకేట్ గర్ల్స్ లాంటి పేరొందిన సంస్థలతో విద్యా శాఖ MOU కుదుర్చుకుంది.
రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో ప్రమాణాలు పెంచాలన్న ముఖ్యమంత్రి నిర్ణయం మేరకు ఆయా సంస్థలు ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి ఆసక్తి చూపుతున్నాయి. దేశంలో పేరొందిన సంస్థల భాగస్వామ్యంతో EdTech సదుపాయాలు కల్పించడం వల్ల రాష్ట్ర విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు అవకాశం ఉంది.
కృత్రిమ మేధ ఆధారిత ప్లాట్ ఫారమ్‌తో EkStep ఫౌండేషన్ 540 పాఠశాలలలో పని చేస్తుంది. ఇకపై 33 జిల్లాల పరిధిలో 5 వేలకు పైగా ప్రాథమిక పాఠశాలలకు విస్తరించనుంది. మూడో తరగతి నుంచి 5వ తరగతి వరకు తెలుగు, ఇంగ్లీషు భాషలతో పాటు మ్యాథ్స్ బేసిక్స్‌ను ఈ సంస్థ అందిస్తుంది. ఇంటర్ విద్యార్థులకు నీట్, జేఈఈ, క్లాట్ పరీక్షలకు ఫిజిక్స్ వాల్లాహ్ ఏపి సన్నద్ధులను చేస్తుంది. పాఠశాల స్థాయి నుంచే పోటీ పరీక్షల దృక్కోణంలో విద్యార్థులకు ఉచిత శిక్షణ అందిస్తుంది.
రాష్ట్రంలో 6వ తరగతి నుంచి పదో తరగతి విద్యార్థుల పాఠ్యాంశాలకు అనుగుణంగా ఖాన్ అకాడమీ వీడియో ఆధారిత STEM (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథ్స్) శిక్షణను అందజేస్తుంది. ప్రజ్వల ఫౌండేషన్ 6వ తరగతి నుంచి క్లాస్ 12 వరకు విద్యార్థులకు రాష్ట్ర వ్యాప్తంగా బాల సురక్ష, రక్షణ కార్యక్రమాలు ప్రారంభిస్తుంది.
ఒకటి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు పీజాం ఫౌండేషన్ కోడింగ్ మరియు కంప్యుటేషనల్ థింకింగ్‌పై శిక్షణను అందిస్తుంది. Educate Girls రాష్ట్రంలో పాఠశాలలకు దూరంగా ఉన్న 16 వేలకు పైగా పిల్లలను తిరిగి బడిలో చేర్పించటంతో పాటు, బాలికల అక్షరాస్యత, విద్యా అవకాశాలను మెరుగుపరచం కోసం పనిచేస్తుంది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావుతో పాటు, విద్యా శాఖ ఉన్నతాధికారులు, ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రాజకీయ వ్యూహం



**కిషన్‌రెడ్డి వ్యాఖ్యల వెనుక ఉద్దేశ్యం..**

కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు కేవలం ఒక సాధారణ ప్రకటనగా కాకుండా.. వ్యూహాత్మక రాజకీయ ఎత్తుగడగా భావిస్తున్నారు. అనేక మంది సినీ ప్రముఖులతో బీజేపీకి మంచి సంబంధాలున్నాయని, గతంలో విజయశాంతి, కోట శ్రీనివాసరావు, కృష్ణంరాజు, ఎస్. జానకి సుమన్, నరేష్ వంటి వాళ్ళు పార్టీలో పనిచేసి, కొందరు మంత్రులుగా కూడా అయ్యారని.. మరికొందరు పార్టీకి ప్రచారం చేశారని కిషన్‌రెడ్డి గుర్తు చేశారు. ఈ వ్యాఖ్యలు సినీ గ్లామర్‌ను పార్టీకి జోడించుకోవాలనే బీజేపీ ఆకాంక్షను సూచిస్తున్నాయి. అయితే.. చిరంజీవి ప్రస్తుత రాజకీయ వైఖరిని పరిశీలిస్తే.. కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు కొంత ఆశ్చర్యం కలిగిస్తాయి. గతంలో తాను ప్రత్యక్ష రాజకీయాల నుంచి పూర్తిగా విరామం తీసుకున్నానని చిరంజీవి అనేకసార్లు స్పష్టం చేశారు. గోవాలో జరిగిన ఓ అవార్డుల కార్యక్రమంలో స్వయంగా కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ తిరిగి రాజకీయాల్లోకి రావాలని ఆహ్వానించినప్పుడు కూడా.. ఆయన అలాంటి ఆలోచన లేదని తిరస్కరించారు. గతంలో వైసీపీ నుంచి రాజ్యసభ సీటు ఆఫర్ వచ్చినా.. బీజేపీ నుంచి రాష్ట్రపతి నామినేటెడ్ కోటాలో అవకాశం ఉందన్న ప్రచారం జరిగినా.. చిరంజీవి వాటిని కొట్టిపడేశారు. తన రాజకీయ అరంగేట్రాన్ని సోదరుడు పవన్ కళ్యాణ్‌కు అప్పగించి.. పరోక్షంగా జనసేనకు మద్దతుగా నిలుస్తున్నారు తప్ప, ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తానన్న సంకేతాలు మాత్రం ఇవ్వడం లేదు. ఈ నేపథ్యంలో.. కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు 'గాల్లో రాయి వేసే ప్రయత్నమే' అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**బీజేపీ రాజకీయ వ్యూహం..**

కిషన్‌రెడ్డి కేవలం చిరంజీవి ప్రస్తావనకే పరిమితం కాకుండా, తెలంగాణ రాజకీయాలపై బీజేపీ వైఖరిని స్పష్టం చేశారు. కుటుంబ, అవినీతి రాజకీయాలకు వ్యతిరేకంగా బీజేపీ పోరాటం చేస్తుందని పునరుద్ఘాటించారు. 'మాకు ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీనే తప్ప, ఎవడో పనికి రాని వాడు బీజేపీ, కాంగ్రెస్ ఒకటే అంటే సమాధానం చెప్పాలా?" అని ప్రశ్నిస్తూ, కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య రాజకీయ పోరును ఎత్తి చూపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్‌లో తదుపరి అధ్యక్షుడు ఎవరో అందరికీ తెలుసని ఎద్దేవా చేస్తూ.. బీజేపీలో మాత్రం అధ్యక్ష పదవికి పోటీ పడాలంటే రెండుసార్లు క్రియాశీల సభ్యుడు అయ్యి ఉండాలనే నియమం ఉందని, తమ పార్టీలో డైనింగ్ టేబుల్ నిర్ణయాలు ఉండవని తెలిపారు. ఈటల రాజేందర్ ఎమ్మెల్యేగా, ఎంపీగా గెలిచారు కాబట్టి.. ఆయనకు ఈ నిబంధన వర్తించదని వివరించారు. రాష్ట్ర అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందనిజ.. తాము అధికారంలో లేనప్పటికీ, తెలంగాణకు కేంద్రం నుంచి అనేక ప్రాజెక్టులు తీసుకువచ్చామని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. టెక్స్‌టైల్ ప్రాజెక్ట్, జహీరాబాద్‌లోని ఇండస్ట్రియల్ పార్క్, పసుపు బోర్డు, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ వంటివి బీజేపీ కృషి వల్లనే వచ్చాయని, కాంగ్రెస్ మంత్రులు తమ వల్లనే వచ్చాయని చెప్పుకుంటూ తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర అభివృద్ధికి బీజేపీ సహకరిస్తుందని.. హైదరాబాద్ మెట్రో నెక్స్ట్ ఫేజ్‌కు కేంద్రం సహకారం అందిస్తుందని కూడా స్పష్టం చేశారు.



# ప్రేమగా మారిన తొలి పరిచయం

## ఆమె ఓ ఆర్టిస్ట్.. అతనో జిమ్ ట్రైనర్..

**పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ జిమ్ ట్రైనర్.. టాలీవుడ్ జూనియర్ ఆర్టిస్ట్ ను వంచించాడు. ప్రేమ పేరుతో ఆ యువతికి దగ్గరై ఆమె నుంచి డబ్బులు జేశాడు. తర్వాత ఆమెను దూరం పెట్టాడు. దీంతో మోసపోయానని గ్రహించిన యువతి జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించింది. యువతి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు జూన్ 14న నిందితుడిని అరెస్ట్ చేసి అతనిపై చీటింగ్, లైంగిక వేధింపులు తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.**

పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ జిమ్ ట్రైనర్.. టాలీవుడ్ జూనియర్ ఆర్టిస్ట్ నుంచి డబ్బులు కాజేసిన ఘటన హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో పీఎస్ పరిధిలో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఓ యువతి 2019లో హైదరాబాద్‌కు వచ్చి సినిమాల్లో చిన్న చిన్న వేషాలు వేస్తూ జూనియర్ ఆర్టిసట్‌గా పనిచేస్తుంది. అయితే 2020లో ఆమెకు గాయత్రి హిల్స్‌లో ఉంటున్న ఓ జిమ్ ట్రైనర్‌తో పరిచయం ఏర్పడింది. వీరి పరిచయం క్రమంగా స్నేహంగా మారింది. ఇద్దరు కలిసి సహజీవనం చేయడం ప్రారంభించారు. గాయత్రి హిల్స్‌లో రెండు నెలలు.. మణికొండలో 2021 నుంచి 2022 మధ్య తొమ్మిది నెలలు కలిసి ఉన్నారు. అయితే కొన్నాళ్ల తర్వాత ఆ జిమ్ ట్రైనర్ ఆ యువతిని దూరం పెట్టడం స్టార్ట్ చేశాడు. దీంతో అతనికి తను పెళ్లి చేసుకోవడం ఇష్టం లేదని గమనించిన బాధితురాలు తన స్వస్థలమైన ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లిపోయింది. 2023 నవంబర్‌లో ఆమె తిరిగి హైదరాబాద్‌కు వచ్చి పీజీ హాస్టల్‌లో ఉంటోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ట్రైనర్ ఆమెను తిరిగి కాంటాక్ట్ అయ్యాడు. పెళ్లి చేసుకుంటానని.. ఖర్చుల కోసం రూ 15 లక్షలు అవసరమని చెప్పాడు. నమ్మకంతో ఆమె డిజిటల్ పేమెంట్స్ రూపేణ రూ7 లక్షలు పంపగా.. మరో రూ7 లక్షలు నగదుగా ఇచ్చింది.
అయితే, డబ్బు తీసుకున్న తర్వాత ట్రైనర్ మళ్లీ ఆమెను దూరం పెట్టడం ప్రారంభించాడు. ఫోన్ చేస్తే రిప్లై ఇవ్వడం లేదు. దీంతో అనుమానం వచ్చి అతని గురించి విచారించగా అతనికి అప్పటికే వివాహం అయిందని తెలిసి బాధితురాలు కంగుతింది. ఆమె మోసపోయానని గ్రహించి తన డబ్బులు తిరిగి ఇవ్వాలని అతనిపై ఒత్తిడి తెచ్చింది. దీంతో జిమ్ ట్రైనర్ రూ. 5లక్షలు తిరిగి ఇచ్చాడు. మిగిలిన డబ్బు అడిగితే తప్పించుకు తిరుగుతుండడంతో బాధితురాలి జూబ్లీహిల్స్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. జిమ్ ట్రైనర్ తనను పెళ్లి చేసుకుంటానని చెప్పి నమ్మించి మోసం చేసి డబ్బులు కాజేశాడని ఫిర్యాదులో పేర్కొంది. బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా BNS సెక్షన్ 69 కింద కేసు నమోదు చేసుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు జిమ్ ట్రైనర్‌ను అరెస్ట్ చేసి పీఎస్‌కు తరలించారు.

# మౌలిక సదుపాయాలే అభివృద్ధికి ఆధారం.. వాటిని అందించడమే మా లక్ష్యం

- GHMC డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి

✍ జయభేరి, హయత్ నగర్ :



మన్సూరాబాద్ డివిజన్ హయత్ నగర్ ప్రాంతం లోని వివిధ కాలనీలో C.C రోడ్డు మరయు భూగర్భ డ్రైనేజీ పనులు పవనగిరి కాలనీ ఫేస్ 2 లో సుమారు సి.సి రోడ్ వ్యయం 36.00 లక్షలు, పవనగిరి కాలనీ ఫేస్ 1లో సుమారు సి.సి రోడ్ వ్యయం 13.00 లక్షలు, ఆదిత్య నగర్ కాలనీ లో సుమారు సి.సి రోడ్ వ్యయం 23.00 లక్షలు, రాజరాజేశ్వరి కాలనీలో సుమారు భూగర్భ డ్రైనేజీ వ్యయం 3.00 లక్షలతో కూడిన పనులను GHMC డిప్యూటీ ఫ్లోర్ లీడర్, స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి అన్ని కాలనీల సంక్షేమ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. దినదిన అభివృద్ధి చెందుతున్న కాలనీలకు కనీస మౌలిక సదుపాయాలను ఎలక్షన్ లో ఇచ్చిన హామీల ప్రకారంగా ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు.

జిహెచ్ఎంసి నుంచి వస్తున్న నిధులకు సంబంధించి స్వయంగా జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ చెప్పిన సమస్య వద్దకు వచ్చి సమస్యను పరివేక్షించి తక్షణమే నిధులు మంజూరు చేస్తూ సహకారం అందిస్తున్నందుకు వారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

అదేవిధంగా కాలనీవాసులు జిహెచ్ఎంసి కౌన్సిల్లో, అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేసి మా కాలనీలు అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళుతున్నందుకు కాలనీ సంక్షేమ సభ్యులు కార్పొరేటర్ కి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఇంకా కొన్ని కాలనీలలో స్ట్రీట్ లైట్లు, ప్రధాన ప్రాంగణాల వద్ద హైమాస్ట్ లైట్లు, విద్యుత్ స్తంభాలు మరయు సి.సి రోడ్డులు, భూగర్భ డ్రైనేజీ కొరకు అర్జీ పెట్టడం జరిగింది. తొందరలోనే దశలవారీగా కృషి చేస్తానని అన్నారు.

ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు కృష్ణ గౌడ్, మురళీధర్ రెడ్డి, సాయిలు గౌడ్, Ch.నరసింహ, K.నరసింహ, వేణుగోపాల్ రెడ్డి, Ch.జాన్, కుమారా స్వామి, రమణ రెడ్డి, M.వెంకటేష్, రామ్ గోపాల్, సందీప్, కాలనీవాసులు, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## వైద్యులు సేవా దృకృథంతో పనిచేయాలి

- మధుయాష్కి గౌడ్

✍ జయభేరి, హైదరాబాద్ :

హెచ్ఐసిసి నోవాటెల్ హోటల్ లో నిర్వహించిన 'సుమన్ టీవీ డాక్టర్ అవార్డు' ల ప్రధానోత్సవ కార్యక్రమానికి టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కి గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవుడు ఎక్కడున్నాడో కనిపించడు కానీ.. కనిపించే ప్రత్యక్ష దైవం వైద్యుడు అని పేర్కొన్నారు. వైద్యం వ్యాపారం కాకూడదని పేర్కొన్నారు. కార్పొరేట్ వైద్యం ఖరీదుగా మారిన నేటి కాలంలో, వైద్యులు సేవా దృకృథంతో పనిచేయాలని సూచించారు. అహ్మదాబాద్ లో జరిగిన విమాన ప్రమాదంలో ప్రయాణికులతో పాటు.. వైద్య కళాశాల లోని వైద్యులు కూడా చనిపోవడం బాధాకరమని, వారికి నివాళులర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. రోగుల ప్రాణాలను కాపాడేందుకు తమ జీవితాన్ని, విలువైన సమయాన్ని కేటాయిస్తూ ఎంతోమంది వైద్యులు తమ అంకితభావాన్ని చాటుతున్నారని పేర్కొన్నారు. అలాంటి వారిని గుర్తించి అవార్డులను ప్రధాన చేయడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా హాజరైన మాజీమంత్రి హరీష్ రావుతో కలిసి మధుయాస్కి వైద్యులకు అవార్డులను ప్రధానం చేశారు.

## రిజర్వేషన్లపై స్పష్టత ఇచ్చిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలి



✍ జయభేరి, తుర్కపల్లి, జూన్ 15 :

రిజర్వేషన్లపై స్పష్టత ఇచ్చిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బిజెపి జిల్లా నాయకుడు డొంకన రాజు గౌడ్ అన్నారు. ఆదివారం తుర్కపల్లి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు ఇవ్వకుండా ఎలా 15 రోజుల్లో ఎన్నికలు నిర్వహిస్తారని అన్నారు. బీసీల రిజర్వేషన్లు కోసం కలిసికట్టుగా కొట్లాడి 42 శాతం రిజర్వేషన్ల కోసం పార్టీలకు అతీతంగా ఏకమై పోరాడుదామని అన్నారు.

# పర్మిషన్లు నిల్.. అక్రమ నిర్మాణాలు ఫుల్...

- లక్షల్లో వసూళ్లు.. అటువైపు చూడని అధికారుల కళ్లు..?
- టౌన్ ప్లానింగ్ లో టిఎస్ బిపాస్ చట్టాలు ఇక్కడ పనిచేయవు..!?
- చర్లపల్లి ప్రధాన రహదారి పక్కన ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణం
- టౌన్ ప్లానింగ్ అధికారులకు ముడుపులు
- టౌన్ ప్లానింగ్ అధికారుల పనితీరు చూస్తే దిమ్మ తిరిగి పోవాల్సిందే..!?

✍ జయభేరి, కాప్రా, మార్చి 09 :



కాప్రా సర్కిల్లో అనుమతులు లేకున్నా.. తమకు నచ్చినట్టుగా యదేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేసుకుంటున్నరు. అక్రమ నిర్మాణాలు చేపట్టడం అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యం..? ఇక వివరాల్లోకి వెళితే కాప్రా సర్కిల్ పరిధిలో చర్లపల్లి, ఫేస్ 4, రైల్వే స్టేషన్ మెయిన్ రోడ్డు మీద ఎలాంటి అనుమతులు లేకుండా ఆయినా సరే అక్రమ కట్టడాలు కొనసాగుతున్నాయి. అధికారి సదరు అక్రమ నిర్మాణాదారులతో చేతులు కలిపి లక్షల్లో ముడుపులు తీసుకుని.. రాతపూర్వకంగా రాసి ఇచ్చిన ఫిర్యాదులను తొక్కిపెట్టి వ్యవహరిస్తున్నాడని ఆరోపణలు ఉన్నాయి.

ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ నిర్మాణాలను అడ్డుకునేందుకు అనేక చట్టాలను తీసుకొస్తున్న అవి మాకు ఏమీ వర్తించవు అన్నట్టుగానే ప్రస్తుత మునిసిపల్ లోని కొంతమంది మాజీ నాయకుల అండ చూసుకొని అందిన కాడికి దండుకోవడమే పనిగా పెట్టుకుని వ్యవహరిస్తున్న తీరును చూస్తే ఔరా అనిపిస్తోంది... ఇక అసలు వివరాల్లోకెళ్తే.. కాప్రా సర్కిల్లో అనుమతులు లేకున్నా.. తమకు నచ్చినట్టుగా యదేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేసుకుంటున్నరు. అక్రమ నిర్మాణాలు చేపట్టడం అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యం..? ఇక వివరాల్లోకి వెళితే కాప్రా సర్కిల్ పరిధిలో చర్లపల్లి, ఫేస్ 4, రైల్వే స్టేషన్ మెయిన్ రోడ్డు మీద ఎలాంటి అనుమతులు లేకుండా ఆయినా సరే అక్రమ కట్టడాలు కొనసాగుతున్నాయి.

1) కాప్రా సర్కిల్ 1, చర్లపల్లి రైల్వే స్టేషన్ రోడ్డు, సర్వే నెంబర్ 190 ప్లాట్ నెంబర్ 25, సెంచ ముఖేష్ చౌదరి, సన్ ఆఫ్ మూలరాం చౌదరి, 277 sq. Yds స్థలంలో భవనం నిర్మాణానికి వన్ స్టిల్ పార్కింగ్ + 2 రెసిడెన్షియల్ నిర్మాణం.

2) కాప్రా సర్కిల్ 1, చర్లపల్లి రైల్వే స్టేషన్ రోడ్డు, సర్వే నెంబర్ 190 ప్లాట్ నెంబర్ 24, పునీతు రామ్, సన్ ఆఫ్ మోతీ రామ్, 277 sq. Yds స్థలంలో భవనం నిర్మాణానికి వన్ స్టిల్ పార్కింగ్ + 2 రెసిడెన్షియల్ నిర్మాణం. రెండు పేర్లతో వన్ స్టిల్ పార్కింగ్ + 2 అంతస్తులకు రెసిడెన్షియల్ అనుమతి తీసుకున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కమర్షియల్ గా నాలుగంతస్తులు నిర్మాణం చేపట్టారు. నేను నిర్మిస్తాను ఎవరు అడ్డుకుంటారో.. అడ్డుకోండి? అనే రీతిలో అన్ని తానే చేస్తున్నాడు.

ఇక ఈ అక్రమ నిర్మాణదారుడికి ఎలాంటి జంకు, భయం, గౌరవం బిడియం లేకుండా నేను ఇంతే అనే రీతిలో అక్రమ నిర్మాణం కొనసాగిస్తూనే ఉన్నాడు. అంటే అధికారులకు అడిగింది ఇచ్చుకున్న, ఇక నాకేంటి భయం..? యధేచ్చగా అక్రమ నిర్మాణాలు చేసుకోవచ్చు! అనే రీతిలో తన పని తాను చేసుకుంటూ అక్రమ నిర్మాణాలకు ఆజ్యం పోస్తున్నడు.. స్థానికులు జిహెచ్ఎంసి అధికారులపై టౌన్ ప్లానింగ్ అధికారిపై అవినీతి ఆరోపణలు గుప్పిస్తున్నారు. అధికారి సదరు అక్రమ నిర్మాణాదారులతో చేతులు కలిపి లక్షల్లో ముడుపులు తీసుకుని.. రాతపూర్వకంగా రాసి ఇచ్చిన ఫిర్యాదులను తొక్కిపెట్టి వ్యవహరిస్తున్నాడని ఆరోపణలు ఉన్నాయి. దాని నిలిపేందుకు అధికారులు చర్య తీసుకున్నది మాత్రం శూన్యం. ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోకపోతే హైకోర్టును ఆశ్రహించాల్సి ఉంటుందని స్థానికులు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# పట్టణం అభివృద్ధికి 30 కోట్ల నిధులు మంజూరు

✍ జయభేరి, ఘట్కేసర్ :



ఘట్కేసర్ మున్సిపల్ పట్టణం అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా 30 కోట్ల నిధులతో నిర్మిస్తున్న రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఘట్కేసర్ మున్సిపల్ చైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్. ఈ సందర్భంగా మాజీ చైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఘట్కేసర్ మున్సిపల్ కి 30 కోట్ల నిధులు మంజూరు అవ్వడం సంతోషంగా ఉందన్నారు.

పట్టణం పరిధిలో 100 feet రోడ్డు అదేవిధంగా సెంటర్ లైటింగ్ తో అతి త్వరలో ప్రారంభం అవుతుంది అని తెలుపుతూ రానున్న రోజుల్లో ఘట్కేసర్ అభివృద్ధిలో ముందుకు వెళ్లేందుకు మా వంతు కృషి ఎల్లప్పుడు ఉంటుంది అని అంతే కాకుండా మీ ప్రజల అందరి సహకారం కావాలని కోరుతూ, జెర్మనీ టెక్నాలజీ తో రోడ్డు నిర్మాణం పనులు జరుగుతున్నాయని అతి త్వరలో రోడ్డు మధ్యలో డివైడర్ సైతం ఏర్పాటు చేసి విద్యుత్ కాంతులతో ఘట్కేసర్ మున్సిపల్ పట్టణం ముస్తాబు అవుతుంది అని కమర్షియల్ లో వ్యాపారం చేసుకునే వారికీ మంచిగా వ్యాపారం ఉంటుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కడుపొల్ల మల్లేష్, డీసీసీ కార్యదర్శి ఆంజనేయులు, మొయినార్టీ అధ్యక్షుడు ఫరూక్, అభిలాష్ యాదవ్, HRDC ఇంజనీర్ డిపార్ట్మెంట్ వారు, తదితరులు పాల్గొన్నారు.



## డివిజన్‌లో డ్రైనేజీ పనుల ప్రారంభం

✍ జయభేరి, మేడిపల్లి :

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 19వ డివిజన్‌లో డ్రైనేజీ పనుల ప్రారంభించిన మున్సిపల్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపిన తుంగతుర్తి రవి. 19వ డివిజన్ లో ప్రారంభమైన డ్రైనేజీ పనులను పర్యవేక్షించి పనులను మొదలు పెట్టిన మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్ కి, సంబంధిత అధికారులకు, మున్సిపల్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు తుంగతుర్తి రవి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జంగా చారి, పాలడుగు విజయేందర్ రెడ్డి, వర్క్ ఇన్స్పెక్టర్ లింగస్వామి, కాలనీవాసులు బొబ్బల ఆంజనేయులు, సర్వేష్, కుమార్ యాదవ్, మద్దూరు చంద్రశేఖర్, అలీ సోజు సంపత్, యోగేశ్వర్, ఏ. స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఆంజనేయ స్వామినీ దర్శించుకున్న వడ్త్యా రమేష్ నాయక్



✍ జయభేరి, డిండి :

డిండి మండలం ఖానాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని జైత్య తండలో కొలువైన శ్రీ శ్రీ శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం దర్శించుకునీ ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించిన BRS దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్యా రమేష్ నాయక్. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నేనావత్ శ్రీను నాయక్, బాలాజీ నాయక్, గోపి, రవి, చాందు, నాగేష్, జోహార్ లాల్, నవీన్, వాల్య, గోపాల్ ,హనుమంతు, గోపి, వెంకటేష్ నాయక్, విజయ్ నాయక్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## చందంపేట మండల ఉపాధ్యక్షులుగా నాగిళ్ళ రాములు నియామకం

✍ జయభేరి, చందంపేట :



చందంపేట భారతీయ జనతా పార్టీ చందంపేట మండల ఉపాధ్యక్షులుగా పోలేపల్లి గ్రామానికి చెందిన నాగిళ్ళ రాములు నియమితులైనారు. ఈ మేరకు మీడియా తో ఆయన మాట్లాడుతూ..నా పై నమ్మకంతో నా యొక్క నియామకానికి సహకరించిన మండల అధ్యక్షులు గుంటోజు వినోధ్ చారి, బిజెపి జిల్లా నాయకులు నాగిళ్ళ సైదులు కి, మరియు నియోజకవర్గ నాయకులందరికీ ధన్యవాదాలు తెలియజేస్తూ పార్టీ ఇచ్చిన బాధ్యతను పార్టీ అభివృద్ధి కోసం ఎల్లవేళల,అహర్నిశలు శ్రమిస్తూ నావంతుగా నా బాధ్యతను కంకణ బద్దుడనై నిర్వహిస్తూ కృషిచేస్తానని చెప్పారు.

## డాక్టరేట్ సాధించిన గిరి పుత్రుడు చందర్



✍ జయభేరి, దేవరకొండ :

దేవరకొండ మండలం రత్య తండాకు చెందిన రమావత్ చందర్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో ఉస్మానియా యూనివర్సిటీ లో డాక్టరేట్ పొందారు.ఆదివారం డాక్టరేట్ సాధించిన చందర్ ను బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అభినందించారు. ఈ సందర్భంగా చందర్ ను శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ......గిరిజన తండాకు చెందిన చందర్ డాక్టరేట్ పొందడం అభినందనీయమని ఆయన అన్నారు.కృషి పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని నిరుపేద కుటుంబంలో జన్మించిన చందర్ డాక్టరేట్ సాధించారని ఆయన అన్నారు.చందర్ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన అన్నారు.రత్య తండలో మొదటి డాక్టరేట్ పొందిన చందర్ అని ఆయన తెలిపారు.

## అంతర్జాతీయ ఫాదర్స్ డే వేడుకలు




✍ జయభేరి, దేవరకొండ :

ఘనంగా వీర వృద్ధాశ్రమం నందు ఆదివారం అధ్యక్షుడు NVT, కొంగరి మధు, DSA ఫోటోగ్రాఫర్ కర్నాటి నరేష్, సభ్యులతో కలిసి కేక్ కట్ చేసి అంతర్జాతీయ ఫాదర్స్ డే శుభాకాంక్షలు తెలియజేసి, ఫ్రూట్స్, బిస్కెట్స్ అందజేసినారు. అనంతరం అధ్యక్షుడు NVT మాట్లాడుతూ, పిల్లల పట్ల తండ్రికి ఉండే ప్రేమ అమితమైనదని, దానికి విలువ కట్టలేమని అన్నారు. ప్రతి తండ్రి పిల్లలకు ఎప్పుడూ బెస్ట్ ఇవ్వాలని తాపత్రయ పడుతూ ఉంటాడని ఆయన అన్నారు. సమాజం ఏ దశలో ఉన్నా తండ్రికి, పిల్లలకు ఉండే ఆ మధురిమ మారదు అన్నారు. ఆయన మాట్లాడుతున్న సమయం లో ఓ వృద్ధుడు ఆయన్ను గుర్తించి బిడ్డా nvt బాగున్నావా? నేను నీకు గుర్తున్నానా అనగానే... పేరు తో సహా చెప్పడం తో ఆ వృద్ధుడు కంటి నిండా నీళ్ళు చెమర్చడం తో nvt ఆయన్ను హత్తుకుని ఓదార్చారు. వారిద్దరూ బావోద్వాగానికి గురయ్యారు. ఈ సందర్భంలో మిగతా వృద్ధులు కంటతడి పెట్టారు. ఈ కార్యక్రమంలో వీర, వృద్ధాశ్రమ నిర్వాహకులు రుత్విక్, షీలా,మణి, కీర్తి, వీరబాబు,వీరాంజనేయులు,వెంకటేశ్వర్లు, వితిన్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# గంటలో దర్శనానికి ప్లాన్

✍ జయభేరి, తిరుమల, జూన్ 15:

తిరుమల శ్రీవారి దర్శనానికి ప్రపంచం నలుమూలల నుంచి భక్తులు తరలి వస్తుంటారు. ప్రతి ఏడాది స్వామి వారిని దర్శించుకునే వారు ఉంటారు. రోజుకు గరిష్టంగా లక్షలాదిమంది.. కనిష్టంగా వేలాది మంది భక్తులు తిరుమల వస్తుంటారు. వారికి దర్శనాలు కల్పించడంతోపాటు నియంత్రించడం టిటిడి కి కష్ట సాధ్యం అవుతుంది. పటిష్టమైన చర్యలు చేపడుతున్న ఎక్కడో చోట లోపాలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. ముఖ్యంగా కొన్ని సందర్భాల్లో క్యూ లైన్లోకి మించి బయటకు భక్తులు వస్తుంటారు. కొన్ని సందర్భాల్లో అయితే గంటలపాటు కాంప్లెక్స్ లలో భక్తులు వేచి ఉండాల్సి ఉంటుంది. ఇటువంటి తరుణంలో వినూత్న ఆలోచన చేసింది తిరుమల తిరుపతి దేవస్థానం. భక్తులు క్యూ లైన్ లలో ఉండగానే స్వామి వారి దర్శన భాగ్యం కల్పించేందుకు నిర్ణయించింది.సాధారణంగా తిరుమల వెళ్లే భక్తులకు స్వామివారి దర్శనానికి కొన్నిసార్లు 12 గంటల సమయం పడుతుంది. ఆ సమయంలో భక్తుల బాధలు వర్ణనాతీతం. టీటీడీ(పరంగా మంచినీరు, మజ్జిగ వంటి సదుపాయాలు అందిస్తోంది. కానీ క్యూలైన్లలో భక్తులు ఉన్నప్పుడు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. అటువంటి సమయంలో స్వామివారి దర్శనానికి వీలుగా ఏర్పాట్లు చేసింది తిరుమల తిరుపతి దేవస్థానం. ఇటీవల చైర్మన్ బిఆర్ నాయుడు అధ్యక్షతన బోర్డు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం కీలక నిర్ణయం తీసుకున్నారు. అందుకు సంబంధించి టీటీడీ ఈవో శ్యామలరావు కార్యాచరణను వేగవంతం చేశారు. ముఖ్యంగా భక్తులు వేచి ఉండే కంపార్ట్మెంట్లు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాల మధ్య ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారుఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కెమెరాలు ద్వారా తిరుమల వచ్చే భక్తుల రద్దీ ని అంచనా వేయనున్నారు టీటీడీ అధికారులు. తద్వారా భక్తులకు దర్శన సమయాన్ని నిర్దిష్టంగా ఇవ్వనున్నారు. ప్రస్తుతం గంటకు ఎంతమంది శ్రీవారిని దర్శించుకుంటున్నారనే సమాచారం టిటిడి వద్ద లేదు. ఆ వివరాలు అందుబాటులోకి వస్తే దళారులు, కొందరు ఉద్యోగుల సహకారంతో ఇష్టారాజ్యంగా క్యూ లైన్లోకి వచ్చే సంస్కృతికి బ్రేక్ పడుతుంది. జియో సంస్థ ఇప్పటికే ప్రయోగాత్మకంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫేషియల్ రికగ్నిషన్ ను ఉపయోగించి భక్తుల యొక్క చిత్రాలు నమోదు చేస్తుంది. తద్వారా గంటల వ్యవధిలోనే తిరుమల శ్రీవారి దర్శనం పూర్తి చేసుకునే విధంగా ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తోంది తిరుమల తిరుపతి దేవస్థానం. ఇదే విషయాన్ని తాజాగా వెల్లడించారు టీటీడీ చైర్మన్ బి ఆర్ నాయుడు.

# అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం



✍ జయభేరి, విజయవాడ, జూన్ 15:

అగ్రిగోల్డ్ బాధితులకు గుడ్‌న్యూస్. దశాబ్దాల పోరాటానికి త్వరలో న్యాయం జరగనుంది. కడుపుకట్టుకుని కూడబెట్టుకున్న సొమ్ము.. మళ్లీ తిరిగి ఇచ్చేందుకు సర్వం సిద్ధమవుతోంది. మరి బాధితులకు ఏవిధంగా నష్టపోయిన సొమ్ము అందించనున్నారు. దీనికి ప్రభుత్వ కార్యాచరణ ఎలా ఉండబోతోంది..? తెలుసుకుందాం. ఆస్తుల పునరుద్ధరణ ద్వారా ఊరట లభించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) ద్వారా జప్తు చేసిన అగ్రిగోల్డ్ సంస్థ ఆస్తులను బాధితులకు పంపిణీ చేయడానికి కోర్టు అనుమతి ఇచ్చింది. ఈ ఆస్తుల మార్కెట్ విలువ సుమారు రూ. 6 వేల కోట్లుగా అంచనా వేయడం జరిగింది. ఈడీ హైదరాబాద్ జోన్ కార్యాలయం, అగ్రి గోల్డ్ గ్రూప్ కంపెనీలు నడిపిన పొంజీ స్కీమ్ బాధితులకు సంబంధించి రూ.611 కోట్ల విలువైన ఆస్తులను పునరుద్ధరించడం ద్వారా మరోసారి విజయాన్ని సాధించింది. అటాచ్‌మెంట్ సమయంలో వీటి విలువ రూ.611 కోట్లు కాగా, ప్రస్తుత మార్కెట్ విలువ రూ.1,000 కోట్లు మించిపోయే అవకాశం ఉందిఈ ఏడాది మే నెలలో ఈడీ, మనీలాండరింగ్ నిరోధక చట్టం (PMLA) 2002 సెక్షన్ 8(8) కింద ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఇందులో అటాచ్ చేసిన స్థిర, చర ఆస్తులను ఆంధ్రప్రదేశ్ సీఐడీకి విడుదల చేసి, ఆస్తులను బాధితులకు తిరిగి అప్పగించే నిమిత్తంగా ఆంధ్రప్రదేశ్ ఫైనాన్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ డిపాజిటర్ల పరిరక్షణ చట్టం (APPDFE), 1999 ప్రకారం పునరుద్ధరించాలని కోరింది. హైదరాబాద్‌లోని మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టు, ఈ పిటిషన్‌ను జూన్ 10, 2025న ఆమోదించింది. ఈ మేరకు 397 స్థిర ఆస్తుల పునరుద్ధరణకు మార్గం సుగమం అయింది. వీటిలో 380 ఆస్తులు ఆంధ్రప్రదేశ్‌లో, 13 తెలంగాణలో, 4 కర్ణాటక రాష్ట్రాల్లో ఉన్నాయి. వీటిలో వ్యవసాయ భూములు, నివాస, వాణిజ్య స్థలాలు, అపార్ట్‌మెంట్లు ఉన్నాయిఅగ్రి గోల్డ్ గ్రూప్‌పై ఈడీ 2018లో దర్యాప్తు చేపట్టింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా, అండమాన్ & నికోబార్ లలో నమోదైన పలు ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈ కేసు విచారణకు వచ్చింది. అగ్రి గోల్డ్ కంపెనీలు అసలైన రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరుతో పొంజీ స్కీమ్ నడిపి దాదాపు 19 లక్షల ఖాతాదారుల నుంచి రూ.6,380 కోట్లను వసూలు చేశాయి. 130కి పైగా కంపెనీలను ఏర్పాటు చేసి ప్రజల వద్ద నుండి 'ప్లాట్ అడ్వాన్స్' పేరుతో డిపాజిట్లు వసూలు చేశారు. వేలాది కమిషన్ ఏజెంట్లను నియమించి ప్రజలను మోసం చేశారు. ఈ డబ్బులను వారు ప్రజలకు తెలియకుండా పవర్, డైరీ, ఆరోగ్యం, ఎంటర్‌టైన్‌మెంట్, వ్యవసాయ రంగాల్లో పెట్టుబడులు పెట్టారు. ఒప్పందం ప్రకారం డబ్బును వెనక్కి ఇవ్వడంలో విఫలమయ్యారు.ఆస్తుల విలువ: ఈడీ దర్యాప్తులో భాగంగా దాదాపు రూ.4141.2 కోట్ల విలువైన స్థిర, చర ఆస్తులను అటాచ్ చేసింది. 2020 డిసెంబర్‌లో అవ్వ వెంకట రామారావు, అవ్వ శేష నారాయణ రావు, అవ్వ హేమ సుందర వర ప్రసాద్‌ను అరెస్ట్ చేసింది. 2021 ఫిబ్రవరిలో 14 మందిపై ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. 2024 మార్చిలో మరో 22 మందిపై సప్లిమెంటరీ చార్జ్‌షీట్ సమర్పించారు.అంతకు ముందు 2025 ఫిబ్రవరిలో రూ.3,339 కోట్ల విలువైన ఆస్తులను బాధితులకు పునరుద్ధరించారు (ప్రస్తుత విలువ రూ.6,000 కోట్లు). తాజా పునరుద్ధరణతో కలిపి మొత్తం రూ.3,950 కోట్ల విలువైన ఆస్తులు బాధితులకు తిరిగి అప్పగించబడ్డాయి. వాటి ప్రస్తుత మార్కెట్ విలువ రూ.7,000 కోట్లకు పైగా ఉంటుంది. ఈ చర్యలు నేరస్థుల వద్ద నుండి దోచుకున్న ఆస్తులను తిరిగి న్యాయబద్ధంగా బాధితులకు అప్పగించడంలో ఈడీ తీసుకున్న ప్రాముఖ్యమైన అడుగుగా భావిస్తున్నారు.అగ్రిగోల్డ్ స్కామ్ బాధితులకు ఈడీ ఆస్తుల పంపిణీ ప్రక్రియ ఒక చారిత్రక అడుగుగా నిలుస్తుంది. రూ. 7,000 కోట్లకు పైగా విలువైన ఆస్తులను బాధితులకు అందించే ఈ ప్రక్రియ, దశాబ్దకాలంగా కొనసాగుతున్న న్యాయ పోరాటానికి ఒక సానుకూల మలుపు. రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలు, ఈడీ, సీఐడీ సమన్వయంతో ఈ ప్రక్రియను వేగవంతం చేయడం ద్వారా బాధితులకు త్వరిత న్యాయం అందుతుందని ఆశిస్తున్నారు. ఈ కృషి, ఆర్థిక మోసాల బాధితులకు న్యాయం అందించడంలో ఒక ఆదర్శంగా నిలుస్తుంది, అలాగే భవిష్యత్తులో ఇలాంటి స్కామ్‌లను నిరోధించేందుకు కఠిన చర్యల అవసరాన్ని గుర్తు చేస్తుంది.

# గ్లోబల్ స్థాయికి భారత ప్యాకేజింగ్ దృష్టి

- హైదరాబాద్‌కు చెందిన చక్రవర్తి ఏ.వి. పి.ఎస్ UNIDO గ్లోబల్ సమావేశంలో కీలక ప్రసంగం

✍ జయభేరి, హైదరాబాద్, జూన్ 15 :



హైదరాబాద్‌కు చెందిన ప్యాకేజింగ్ నిపుణుడు చక్రవర్తి ఏ.వి.పి.ఎస్, ఎకోబ్లిస్ ఇండియా చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, అలాగే వరల్డ్ ప్యాకేజింగ్ ఆర్గనైజేషన్ (WPO) గ్లోబల్ అంబాసిడర్, థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌లో నిర్వహించిన అంతర్జాతీయ UNIDO రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రత్యేక అతిథిగా ప్రసంగించారు. ఆసియాలో ఆహార ప్యాకేజింగ్ పరిశ్రమలో స్థిరమైన పారిశ్రామిక అభివృద్ధిని వేగవంతం చేయడం, ఇది WPO, వాగెనింగెన్ విశ్వవిద్యాలయం & రీసెర్చ్ (WUR), నెదర్లాండ్స్ సహకారంతో నిర్వహించబడింది. WUR ప్రపంచ ప్రాముఖ్యత గల జీవశాస్త్ర, వ్యవసాయ పరిశోధన సంస్థ. భారతదేశంలో ఆహార నష్టం సమస్యకు ప్యాకేజింగ్ పరిష్కారం ఉంది అని ఆసియా దేశాలకు చక్రవర్తి సందేశం ఇచ్చారు. ఆసియా ఖండంలోని 15 పైగా దేశాల ప్రతినిధులు పాల్గొన్న ఈ సమావేశంలో చక్రవర్తి మాట్లాడుతూ.. "భారతదేశం పంట కోత అనంతరం 30% వరకు ఆహారాన్ని పోగొట్టుకుంటోంది. దీనికి కారణం తగిన ప్యాకేజింగ్ లేకపోవడం, హ్యాండ్లింగ్ లోపాలు, చైన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లో గ్యాప్లు అన్నారు. ప్యాకేజింగ్‌ను ఖర్చుగా పరిగణించ కూడదు. దీనిని విలువను కాపాడే అవసరంగా పరిగణించాలి." అరటి నార నుండి బాగాస్ (చెరకు పిప్పి) వరకు భారత ప్యాకేజింగ్ ఆవిష్కరణలు ప్రపంచ మెప్పు పొందాయి అని ఆయన తెలిపారు. చక్రవర్తి తన ప్రసంగంలో భారతదేశంలో అభివృద్ధి చెందుతున్న పర్యావరణ అనుకూల ప్యాకేజింగ్ రంగాన్ని వివరించారు. పాల ఉత్పత్తులు, తొందరగా పాడుబడే వస్తువుల కోసం సజీవ, స్మార్ట్ ప్యాకేజింగ్ దశలవారీగా ఎలా స్వీకరించబడుతుందో తెలిపారు. అరటి నారు, అరేకా ఆకు, చెరకు బాగాస్ ఆధారిత ప్యాకేజింగ్ ఆవిష్కరణలగురించి ప్రస్తావించారు. పర్యావరణ అనుకూల సాంకేతిక ఆధారిత అంకురసంస్థలు ఏవిధంగా పర్యవరణ అనుకూల ప్యాకేజింగ్‌కు తోడ్పడుతున్నాయో విశదీకరించారు. కొల్డ్ చైన్, R&D కేంద్రాల విస్తరణ ఏవింధంగా వేగంగా కొనసాగుతుందో వివరంగా చర్చించారు. "భారత ప్యాకేజింగ్ రంగం వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఇది ఆసియాలో స్థిరమైన మార్పుకు నాయకత్వం వహించగల సామర్థ్యాన్ని కలిగి ఉంది," అని ఆయన అన్నారు. ఆహార భద్రతలో ప్యాకేజింగ్ కీలకం అని ఈ UNIDO వేదికలో స్పష్టత ఏర్పడింది. ఈ గ్లోబల్ రౌండ్‌టేబుల్‌లో పాల్గొన్న ప్రముఖులు లూసియానా పెల్లెగ్రినో, అధ్యక్షురాలు, WPO, అలి బదెర్నా, డివిజనల్ చీఫ్, యూనిదో, ఈల్కె వెస్ట్రా, ప్రోగ్రాం మేనేజర్, WUR సమావేశాన్ని డాక్టర్ జోహన్నెస్ బర్గ్‌మైర్, జనరల్ సెక్రటరీ, WPO సమన్వయం చేశారు.



ప్రసంగకర్తలందరూ ప్యాకేజింగ్ అనేది కేవలం రూపం గల విషయమేం కాదు, ఇది ఆహార భద్రత, నాణ్యత, గ్లోబల్ SDGs సాధనకు మూలస్తంభం అని స్పష్టం చేశారు. ఆహార నష్టాన్ని తగ్గించేందుకు వ్యూహాత్మక రోడ్‌మ్యాప్ విడుదల జరిగింది. ఈ సమావేశంలో UNIDO, WPO, WUR సంయుక్తంగా రచించిన "Navigating the Food Loss and Waste Paradox: Balancing Food Loss Reduction with Save Food Packaging" అనే పరిశోధనా నివేదికను విడుదల చేశారు. ఈ పత్రంలో తక్కువ ఆహార వ్యర్థాన్ని కలిగించే స్థిరమైన ప్యాకేజింగ్ మార్గాలపై కార్యాచరణ ప్రణాళికను దేశాల కోసం అందించారు. ఈ గ్లోబల్ వేదిక భారత ప్యాకేజింగ్ పరిశ్రమకు గొప్ప గుర్తింపు తీసుకువచ్చింది. ఆసియాలో పునాది బలమైన, స్థిరమైన ఆహార వ్యవస్థలను నిర్మించడంలో భారతదేశం ముందడుగు వేసినట్లు ఇది సూచిస్తోంది.

# ఖరీఫ్ ప్రణాళికలు రెడీ

✍ జయభేరి, ఏలూరు, జూన్ 15:



ఖరీఫ్ పంటలను తుఫాన్ల నుంచి రక్షించుకునేలా పంటకాలాన్ని ముందుకు తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. దీంతో వ్యవసాయ శాఖ అధికారులు కార్యాచరణ మొదలుపెట్టారు. ఇందుకు అనుగుణంగా గోదావరి, కృష్ణా డెల్టా ప్రాంతాలకు ఈ ఏడాది ముందుగానే సాగునీరు విడుదల చేశారు.. పశ్చిమ గోదావరి, ఏలూరు, కోనసీమ, తూర్పుగోదావరి, కాకినాడ, కృష్ణా జిల్లాల్లో భూములకు కాలువల ద్వారా ఇప్పటికే నీరు విడుదల చేశామని అధికారులు తెలిపారు. జూలై మొదటివారంలో గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు నీరు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని వివరించారు.రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్‌లో ప్రధానంగా వరి, కందులు, వేరుశనగ, ప్రత్తిసాగు చేస్తుండగా... వేరుశనగ, ప్రత్తి సాగు తగ్గుతూ వస్తోందని పేర్కొన్నారు. కందుల సాగుమాత్రం పెరిగిందని... వరి సాగు స్థిరంగా కొనసాగుతోందని అధికారులు చెప్పారు 20 ఏళ్లుగా పరిశీలిస్తే ఆంధ్రప్రదేశ్ 14 తుఫాన్లను ఎదుర్కొంది. వీటిలో 5 తుఫాన్లు అక్టోబర్‌లో, 6 తుఫాన్లు నవంబర్‌లో, 3 తుఫాన్లు డిసెంబర్‌లో రాష్ట్రంపై ప్రభావం చూపాయి. అక్టోబర్‌లో వచ్చే తుఫాన్లు ఎక్కువగా ఉత్తర కోస్తా, తూర్పుగోదావరి జిల్లాలకు నష్టం కలిగించాయి. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో తుఫాన్ల ప్రభావం తగ్గేలా ఖరీఫ్ సాగు ఉండాలని అధికారులకు సీఎం సూచించారు365 రోజులు సాగుభూములు పచ్చగా ఉండేలా చూడాలని... ఇందుకోసం 3 పంటల విధానం తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు... అధికారులకు సూచించారు. వచ్చే ఏడాది వేసవిలో ఉత్తర కోస్తా, గోదావరి, కృష్ణా డెల్టా ప్రాంతాల్లోని 5 లక్షల ఎకరాల్లో వేసవి పంటలు వేయాలని చెప్పారు. అనంతపురం వంటి జిల్లాల్లో 365 రోజుల్లో కేవలం 4 నెలలే పంటలు సాగు చేసి, 8 నెలల పాటు భూములు ఖాళీగా వదిలేస్తున్నారని...దీనివల్ల భూసారం దెబ్బతింటోందని ప్రస్తావించారు. మిగిలిన 8 నెలలు కూడా ఏదో ఒక పంట సాగు చేసే పరిస్థితులు కల్పించాలని చెప్పారు. వచ్చే వేసవిలో జలవనరుల లభ్యత ఉన్న 141 మండలాల్లోనూ పంటల సాగు జరిగేలా రైతుల్ని సన్నద్ధం చేయాలన్నారు. ఇందులో 19 మండలాలు రిజర్వాయర్లు, 57 మండలాలు చెరువులు, 65 మండలాలు భూగర్భ జలాలపై ఆధారపడి ఉన్నాయని... వీటిని వినియోగించుకుని దిగుబడులు సాధించాలన్నారు. అలాగే వరిలో అధిక డిమాండ్ ఉన్న సన్నరకాలను పండిచేలా రైతులను ప్రోత్సహించాలని దిశా నిర్దేశం చేశారు.హెచ్డీ బర్లీ పొగాకు కొనుగోళ్లు పర్చూరు ఏఎంసీలో ప్రారంభించామని, దీనిపై రైతుల్లో సంతృప్తి వ్యక్తమైందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. హెచ్డీ బర్లీ స్థానంలో ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. కోకో, మామిడి కొనుగోళ్ల వివరాలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. వాట్సాప్ గవర్నెన్స్ మన మిత్ర ద్వారా కొత్తగా వ్యవసాయ శాఖకు సంబంధించి 3 సేవలు అందుబాటులోకి తెచ్చామని వెల్లడించారు.ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించాలని సీఎం చంద్రబాబు సూచించారు. భూసారాన్ని కాపాడేందుకు కృషి చేయాలన్నారు. ఎక్కడా ఎరువుల కొరత లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఎరువులు, పురుగుమందుల వినియోగంపై సమాచారం ఉండాలన్నారు. గత ఏడాది పంటకాలంలో 39 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు వినియోగించగా, ఈ ఏడాది దానిని 35 లక్షల మెట్రిక్ టన్నులకు తగ్గించేలా చూడాలని దిశానిర్దేశం చేశారు.

# ట్రెండింగ్ లో కేసీఆర్ జగన్ కం బ్యాక్

✍ జయభేరి, హైదరాబాద్, జూన్ 15:



అధికారం కోసం రాజకీయ పార్టీలు ఏమైనా చేస్తాయి. ఎలాంటి పనులకైనా పాల్పడుతుంటాయి. ఎందుకంటే అధికారం అనేది మత్తులాంటిది. అధికారమనేది మంత్రదండం లాంటిది. దానివల్ల వెనకేసుకోవచ్చు.. దాచుకోవచ్చు.. గిట్టని వాళ్లను పాదాల కింద తొక్కవచ్చు. అందువల్లే రాజకీయ నాయకులు అధికారం కోసం అర్రులు చాస్తూ ఉంటారు. వెనకటి కాలంలో అధికారం కోసం రాజకీయ నాయకులు విస్తృతంగా ప్రచారాలు నిర్వహించేవారు. కార్యకర్తలతో మంతనాలు జరిపేవారు. పై స్థాయి నాయకులతో భేటీలు నిర్వహించేవారు. కానీ ఇప్పుడు రాజకీయాల ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది కదా. రాజకీయాలు చేసే తీరు పూర్తిగా వేరే తీరు సంతరించుకుంది కదా. అందువల్లే రాజకీయ నాయకులు తమ సిద్ధాంతాలను మార్చేసుకున్నారు. తమ వ్యూహాలకు వేరే విధంగా పదును పెట్టుకున్నారు. సోషల్ మీడియా అందుబాటులోకి వచ్చిన తర్వాత రాజకీయ నాయకులు మరింతగా మారిపోయారు. ఒకరకంగా చెప్పాలంటే ప్రజలతో సంబంధాలు నెరిపే కంటే..సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండడానికి ఆసక్తి చూపిస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజలు గుర్తుకు రారు. కేవలం వారి సొంత ప్రయోజనాలు మాత్రమే నాయకులకు గుర్తుకు వస్తుంటాయి. అధికారం దూరమైతే వారికి ప్రజలు గుర్తుకు వస్తుంటారు. ముందుగానే చెప్పినట్టు ఈ కాలంలో సామాజిక మాధ్యమాల వినియోగం పెరిగిపోయింది.. సోషల్ మీడియా లేకుంటే రాజకీయ నాయకులకు నిమిషం కూడా గడవలేని పరిస్థితి నెలకొంది. అందువల్లే వారు సోషల్ మీడియాలో తమ కిరాయి సైన్యంతో రకరకాల ప్రచారాలు చేయిస్తున్నారు. అధికారంలో ఉన్న పార్టీకి ఏదో జరిగిపోతుందని.. ప్రజలు మొత్తం తీవ్రమైన దుఃఖంలో ఉన్నారని.. విపరీతమైన కష్టంలో ఉన్నారని.. ఈ సమయంలో తమ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని ఆ రాజకీయ పార్టీ నాయకులు సోషల్ మీడియాలో పెడ బొబ్బలు పెడుతున్నారు. అంతేకాదు తమ సోషల్ మీడియా సైన్యంతో రకరకాల వీడియోలు రూపొందించి పోస్ట్ చేస్తున్నారు..వాస్తవానికి ప్రజలు తిరస్కరిస్తేనే కదా అధికారాన్ని కోల్పోయింది.. ప్రతిపక్ష స్థానానికి పరిమితమైంది.. మరి ఆ మాత్రం సోయి ఆ రాజకీయ పార్టీల నాయకులకు ఎందుకు లేకుండా పోయింది.. అధికారంలో ఉన్నప్పుడు ప్రజలను ఏ విధంగా ఇబ్బంది పెట్టారు.. ఏ విధంగా హింసించారు అనేది ఆ నాయకులకు గుర్తుకు రాదా.. పోనీ గుర్తుకు ఉండదా.. ఇప్పుడు సోషల్ మీడియాలో ఒక వీడియోను కొంతమంది తెగ సర్కులేట్ చేస్తున్నారు. ఆ వీడియోలో రెండు తెలుగు రాష్ట్రాల మాజీ ముఖ్యమంత్రులు కెసిఆర్, వైయస్ జగన్మోహన్ రెడ్డి ఉన్నారు. గతంలో వీరిద్దరూ ముఖ్యమంత్రులుగా పనిచేసినప్పుడు.. భాయీ భాయీ అన్నట్టుగా తిరిగేవారు. అంతేకాదు ఒకరికి ఒకరు సహాయం కూడా చేసుకున్నారు. ఈ క్రమంలో వారిద్దరూ మళ్లీ అధికారంలోకి రావాలని.. వారిద్దరి కోసం రెండు తెలుగు రాష్ట్రాలు ఎదురుచూస్తున్నాయని కొంతమంది గతంలో ఉన్న దృశ్యాలను వీడియోలుగా రూపొందించి సోషల్ మీడియాలో సర్కులేట్ చేస్తున్నారు. అంతేకాదు వీరిద్దరూ తెలుగు రాష్ట్రాలకు ముఖ్యమంత్రులుగా రావాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు.. వాస్తవానికి ఈ మాటలు అంటున్నది ప్రజలు కాదు.. సామాన్యులు అంతకన్నా కాదు. ముందుగానే చెప్పినట్టు ప్రజలతో సంబంధాలను పెంచుకోవడానికి నేటి కాలంలో రాజకీయ నాయకులు ఇష్టం చూపించడం లేదు. ఆసక్తిని ప్రదర్శించడం లేదు. కోటలాటి గృహాలలో ఉండుకుంటూ... ఇనుప కాంచన నిర్మించుకుంటూ అందులో నివసిస్తున్నారు. అలాంటి వారికి అధికారాన్ని తిరిగి తెప్పించడానికి కొంతమంది సోషల్ మీడియాలో గంగ వెర్రులు ఎత్తుతున్నారు. లేనిపోని ప్రచారం చేసి ఏదో జరిగిపోతుంది అనే భ్రమ కల్పిస్తున్నారు.



# విద్యార్థులకు బస్ సర్వీసులు పునరుద్ధరించాలి

- కళాశాలల, పాఠశాలల సమయాలకు అనుగుణంగా బస్సులు నడపాలి
- బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ

✍ జయభేరి, దేవరకొండ :

విద్యా సంవత్సరం ప్రారంభమైన నేటికీ విద్యార్థులకు బస్ సర్వీసులు పునరుద్ధరించక పోవడం చాలా బాధాకరమని బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. ఆదివారం దేవరకొండ పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. సోమవారం నుంచి విద్యార్థులకు బస్ సర్వీసులు పునరుద్ధరించాలి అని ఆర్టీసీ అధికారులను ఆయన డిమాండ్ చేశారు.కళాశాలల, పాఠశాలల సమయాలకు అనుగుణంగా బస్సులు నడపాలి అని ఆయన కోరారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా ఆర్టీసీ అధికారులు చూడాలని ఆయన కోరారు.బస్సు పాస్ చార్జీల పెంపు నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.లేనిచో రాష్ట్రవ్యాప్తంగా బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని అయన హెచ్చరించారు.

# మృతుని కుటుంబాన్ని పరామర్శించిన ఆర్టిఐ కమిషనర్



✍ జయభేరి, తుర్కపల్లి, జూన్ 15 :

తుర్కపల్లి మండల కేంద్రానికి చెందిన బండారి చంద్రమౌళి ఇటీవల మరణించడంతో ఆయన కుటుంబాన్ని ఆర్టిఐ కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కోట సురేష్,కూరెళ్ళ బాలకృష్ణ, బండారి శీను, తదితరులు పాల్గొన్నారు.



# సరస్వతిదేవి తల ఎత్తుకునేలా కుబేర

'కుబేర' పూర్తిగా శేఖర్ కమ్ముల ఫిల్మ్. మేమంతా పాత్రలం మాత్రమే. తన కంఫర్ట్ జోన్ నుంచి బయటకొచ్చి శేఖర్ చేసిన సినిమా ఇది. ఈ సినిమాతో మా ఆర్టిస్టులందరి ఆకలి తీర్చేశారు శేఖర్ కమ్ముల. సినిమా విజయంపై పూర్తి నమ్మకంతో ఉన్నాం.' అని అక్కినేని నాగార్జున అన్నారు. ఆయన ప్రత్యేక పాత్రలో ధనుష్ హీరోగా రూపొందిన పాన్ ఇండియా చిత్రం 'కుబేర'. రష్మిక మందన్నా కథానాయిక. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో సునీల్ నారంగ్, రామ్మోహన్ పుస్కూర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో నాగార్జున మాట్లాడారు. ఈ సినిమా కథ గురించి తెలిసి షాకయ్యానని, రిచ్ ప్రపంచాన్నీ, పూర్ ప్రపంచాన్ని ఈ కథలో శేఖర్ ఎలా కలిపారో చూడాలని తానూ ఎదురుచూస్తున్నానని అతిథిగా విచ్చేసిన ఎస్.ఎస్.రాజమౌళి తెలిపారు. ధనుష్ మాట్లాడుతూ ' 'కుబేర' కోసం శేఖర్ కమ్ముల చాలా కష్టపడ్డారు. ఆరోగ్యాన్ని కూడా లెక్కచేయలేదు. ఆయనతో పని చేయడం ప్రౌడ్‌గా ఫీలవుతున్నా. 'సార్' తర్వాత నేను చేసిన తెలుగు సినిమా ఇది. నా కెరీర్‌కి 'కుబేర' నిజంగా స్పెషల్.' అని చెప్పారు. "'కుబేర' నాకు తల్లిలాంటి సినిమా. బిచ్చగాడైనా కోటీశ్వరుడైనా తల్లిప్రేమ ఒక్కటే. ఆ ఎమోషన్‌తోనే ఈ సినిమా తీశాను. దర్శకుడయ్యే ముందు సరస్వతీ దేవి తలదించుకునేలా సినిమాలు చేయకూడదని ప్రామిస్ చేసుకున్నా. ఈ సినిమా సరస్వతి తల ఎత్తుకునేలా ఉంటుంది. నిజంగా కొత్త సినిమా. అన్ని ఎమోషన్స్‌ ఉన్న నిజమైన పాన్ ఇండియా సినిమా ఇది. మీరు డెఫినెట్‌గా గొప్ప సినిమా చూడబోతున్నారు.' అని శేఖర్ కమ్ముల నమ్మకం వెలిబుచ్చారు. ఇంకా కథానాయిక రష్మిక మందన్నాతోపాటు నిర్మాతలు సునీల్ నారంగ్, రామ్మోహన్ పుస్కూర్, తోట తరణి, దేవిశ్రీ ప్రసాద్, జాన్వీ నారంగ్ కూడా మాట్లాడారు.

# అల్యూమినియం ఫ్యాక్టరీలో ఫైటింగ్



రామ్ పోతినేని నటిస్తున్న మాస్ ఎంటైర్టైనర్ 'ఆంధ్రా కింగ్ తాలూకా'. మహేష్‌బాబు పి. దర్శకుడు. ప్రతిష్టాత్మక మైత్రీమూవీమేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, వై.రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సూపర్‌స్టార్ సూర్యకుమార్‌గా కన్నడ స్టార్ ఉపేంద్ర ఇందులో ఓ పవర్‌ఫుల్ పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్ అల్యూమినియం ఫ్యాక్టరీలో జరుగుతున్నది.
రామ్, ఉపేంద్ర పాల్గొనగా ఈ షెడ్యూల్‌లో కీలకమైన టాకీ పార్ట్‌ని దర్శకుడు మహేష్‌బాబు తెరకెక్కిస్తున్నారు. ఈ సీన్స్ సినిమాలో మేజర్ హైలైట్‌గా ఉండబోతున్నాయని మేకర్స్ చెబుతున్నారు. గ్రేట్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమాగా ఇది నిలుస్తుందని, ఇప్పటివరకూ చేయని ఒక యూనిక్ క్యారెక్టర్‌ని రామ్ ఇందులో చేస్తున్నారని మేకర్స్ తెలిపారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక.



# క్యూట్ క్యూట్ కోమలి..


కోమలి ప్రసాద్ ఇప్పుడిప్పుడే తెలుగులో పాపులర్ అవుతుంది. హీరోయిన్‌గా... క్యారెక్టర్ ఆర్టిస్టుగా వరుస సినిమాలు, వెబ్ సిరీస్ చేస్తూ ప్రేక్షకులను అలరిస్తుంది. తాజాగా బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతున్న హిట్ 3 చిత్రంలో పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రను పోషించింది. హిట్ 2లో పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటించింది. ఇక ఇప్పుడు హిట్ 3లోనూ పోలీస్ ఆఫీసర్‌గా అదరగొట్టేసింది. ఈ సినిమాతోనే ఈ ముద్దుగుమ్మకు మరింత క్రేజ్ వచ్చేసింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కోమలీ ప్రసాద్.. తన గురించి ఆసక్తికర విషయాలను బయటపెట్టింది. కోమలీ ప్రసాద్ మాట్లాడుతూ.. "నేను డెంటిస్ట్‌ను.. డాక్టర్ చదువు పూర్తి చేసి డెంటిస్ట్‌గా పనిచేశాను. సినిమాల్లోకి వస్తానంటే నాన్న ఒప్పుకోలేదు. డాక్టర్ సర్టిఫికెట్ ఉన్నాకే ఏదైనా చేయమన్నారు. చేతిలో డిగ్రీ ఉంటే సేఫ్గా ఉంటుంది అని చెప్పారు. అందుకే ఇండస్ట్రీలోకి లేట్ గా వచ్చాను. న్యూయార్క్ వెళ్లి మాస్టర్స్ చేద్దాం అనుకున్నాను. అప్పుడే నేను సీత దేవి సినిమా ఛాన్స్ వచ్చింది. నా సెకండ్ సినిమా డైరెక్టర్ అందులో హీరో. నటించమని అడగడంతో నా మాస్టర్స్ అప్లికేషన్ చింపేసి సినిమాల్లోకి వచ్చాను" అంటూ చెప్పుకొచ్చింది. కోమలీ ప్రసాద్ క్యాసికల్ డ్యానర్. తెలుగులో నెపోలియన్, హిట్, టచ్ మీ నాట్, లూజర్ వంటి చిత్రాల్లో నటించింది. ఇక ఈ చిన్నది సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటుంది. రెగ్యులర్ గా ఫోటోలు, వీడియోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. ఈ చిన్నది షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాను షేక్ చేస్తుంది ఈ ముద్దుగుమ్మ.



# రూ.500లతో ముంబై వచ్చి..

తెలుగు సినిమాతోనే ఇండస్ట్రీలోకి నటిగా ఎంట్రీ ఇచ్చింది. కట్ చేస్తే బాలీవుడ్ లో చక్రం తిప్పింది. బ్యాక్ టూ బ్యాక్ సినిమాల్లో నటించి ఓ రేంజ్ ఫాలోయింగ్ సొంతం చేసుకుంది. కృషి, పట్టుదలతో ప్రయత్నిస్తే ఎలాంటి సవాళ్లు.. ఎన్ని అడ్డంకులైనా దాటి గమ్యాన్ని చేరొచ్చు అని నిరూపించుకుంది. ఇక ఇప్పుడు సినీరంగంలో భారీ విజయాన్ని సాధించింది. లక్నోలోని అమిటీ విశ్వవిద్యాలయం నుండి కంప్యూటర్ సైన్స్‌లో బిటెక్ పూర్తి చేసింది. అదే సమయంలో నటనపై ఆసక్తి కలగడంతో ఇంజనీరింగ్ పూర్తి చేసి ముంబై వెళ్లింది. ఆ సమయంలో కేవలం రూ.500 మాత్రమే ఆమె వద్ద ఉన్నాయని గతంలో పలు ఇంటర్వ్యూలలో చెప్పింది. తొలినాళ్లల్లో రూం రెంట్ కట్టేందుకు సైతం ఎంతో ఇబ్బంది పడ్డానని.. కానీ ఎప్పుడూ తన ఆశ మాత్రం వదులుకోలేదని తెలిపింది. నటిగా మారేందుకు నిరంతరం ప్రయత్నిస్తూనే ఉన్నానని చెప్పుకొచ్చింది. డైరెక్టర్ పూరి జగన్నాథ్ దర్శకత్వంలో వరుణ్ తేజ్ నటించిన లోఫర్ సినిమాతో సినీరంగంలోకి కథానాయికగా అరంగేట్రం చేసింది. 2015లో విడుదలైన ఈ సినిమా అంతగా హిట్ కాలేదు. దీంతో బాలీవుడ్ షిఫ్ట్ అయిన ఈ ముద్దుగుమ్మకు వరుస ఆఫర్స్ వచ్చాయి. తక్కువ సమయంలోనే బాలీవుడ్ లో టాప్ హీరోయిన్ గా క్రేజ్ సొంతం చేసుకుంది. ఇటీవలే ప్రభాస్ సరసన కల్కి 2898 ఏడీ సినిమాలో నటించింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది ఈ ముద్దుగుమ్మ.

# విడాకుల తర్వాత తొలిసారి కలవబోతున్న సమంత నాగ చైతన్య..



ఘాడంగా ప్రేమించుకొని పెద్దలని ఒప్పించి పెళ్లి చేసుకున్న నాగ చైతన్య, సమంత అనుకోని కారణాల వలన పెళ్లైన నాలుగేళ్లకే విడిపోయారు. వీరి విడాకుల వ్యవహారం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశం అయింది. ఎంతో అన్యోన్యంగా ఉండే ఈ జంట ఎందుకు విడిపోయారు, మళ్లీ కలిస్తే బాగుండు అని చాలా మంది అనుకున్నారు. విడాకుల తర్వాత నాగ చైతన్య, సమంత కలిసింది లేదు, మాట్లాడుకుంది లేదు. ఇక సమంత నుండి విడిపోయిన తర్వాత నాగ చైతన్య.. శోభిత దూళిపాళ్లని వివాహం చేసుకోగా, సమంత.. రాజ్ నిడిమోరుతో డేటింగ్ లో ఉందనే టాక్ నడుస్తుంది. అయితే ఇన్నేళ్లకి సమంతనాగ చైతన్య కలవబోతున్నారంటూ ఓ వార్త తెగ వైరల్ అవుతుంది. నాగ చైతన్య సమంత జంటగా నటించిన క్లాసిక్ లవ్ స్టోరీ ఏ మాయ చేశావే చిత్రం మరోసారి థియేటర్లలో సందడి చేసేందుకు సిద్ధమైంది. మూవీ విడుదలై 15 ఏళ్లు అవుతున్న సందర్భంగా . జులై 18న థియేటర్స్ లో గ్రాండ్ రీ రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో మూవీ ప్రమోషన్స్ కోసం చై సామ్ మళ్ళీ కలుస్తారా? అనే చర్చ మొదలైంది. ఈ చిత్రంతోనే సమంత కథానాయికగా ఆరంగేట్రం చేసింది. గౌతమ్ మీనన్ సామ్ ని అద్భుతంగా తెరపై ఆవిష్కరించారు. తన క్యూట్ లుక్స్ తో ఎంతగానో ఆకట్టుకుంది సమంత. ఇక ఇదే చిత్రంతో రొమాంటిక్ లవర్ బోయ్ గా చైతూకి సరికొత్త ఇమేజ్ వచ్చింది. ఈ చిత్రం ఇద్దరికి చాలా స్పెషల్ అని పలు సందర్భాలలో వారు చెప్పుకొచ్చారు. మరోవైపు ఈ మూవీ షూటింగ్ టైంలోనే వారిద్దరు ప్రేమలో పడ్డట్టు సమాచారం. సమంత తన వీపుపై ఈ సినిమాకి, తమ ప్రేమకి గుర్తుగా వైఎంసీ అనే టాటూ కూడా వేయించుకుంది. మరి ఇద్దరికి అంత స్పెషల్ అయిన ఏ మాయ చేశావే చిత్ర రీరిలీజ్ అవుతున్న సందర్భంగా వారు కలిసి ప్రమోట్ చేస్తే బాగుంటుందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. అయితే దాదాపు కుదరకపోవొచ్చని కొందరి అభిప్రాయం . కనీసం ఈ సినిమా ద్వారా చై సామ్ లని మళ్ళీ ఒకే స్క్రీన్ పై చూసే అవకాశం లభిస్తుండడంతో అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com